ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025

బాలికపై లైంగికదాడి

● నిందితుడిపై పోక్సో కేసు

ఆదిభట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ రాజీవ్ గృహకల్పకు చెందిన డ్రైవర్ బోదాసు ప్రభాకర్(22) ఇదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానని వేధించాడు. బాలిక తల్లిదండ్రులు లేని సమయంలో ఆమెను తనింటికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాలిక తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



మహేశ్వరం రాజరాజేశ్వర ఆలయంలో..

గాయత్రీమాతగా దుర్గాదేవి

మహేశ్వరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా శరన్నవరాత్రుల వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు మంగళవారం మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సుప్రభాసేవ, ఫలరసాభిషేకం, సహస్రనామార్చన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, రాకేష్, నరేష్, శంకర్, తిరుపతయ్య, సాయిలు, శ్రీశైలం, సువర్ణ పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో కుంకుమార్చన

ఆమనగల్లు: ఆమనగల్లులోని మార్కండేయ ఆలయంలో కుంకుమార్చన చేశారు. గుజ్జరి స్రవంతి-ప్రవీణ్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, శివలింగం, రవి, మహేశ్, అలివేలు, యాదగిరి, గిరి, బిక్షపతి, పాండు, రమేశ్, శ్రీను, రాఘవేందర్, శంకర్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: కుంకుమార్చనలో మహిళలు



హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మత విద్వేషాలు సమాజానికి చేటు

» షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కులం, మతం పేరిట విద్వేషాలను రెచ్చగొట్టడం సమాజానికి చేటు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో హనుమాన్ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పాపం హద్దు మీరినప్పుడు భగవంతుడు జీవుల రూపంలో అవతరిస్తాడని అన్నారు. ప్రతి వ్యక్తి విద్వేషాలు, విభేదాలు పక్కనబెట్టాలన్నారు. సమాజ సన్మార్గానికి ఆలయాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.3లక్షలు అందించారు మాజీ ఎమ్మెల్యే నర్సింహులు గ్రామాన్ని ఆధ్యాత్మిక చింతనవైపు నడిపిస్తుండడం గ్రామస్తుల అదృష్టమని అన్నారు. బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. శ్రీరాముడి సేవకుడిగా హనుమంతుడు ఏనాడూ తన మేలు చూసుకోలేదని అన్నారు. పురాతన ఆలయం రోడ్డువిస్తరణలో తొలగించాల్సి వచ్చిందని, దాతల సహకారంతో ఇప్పుడు పునర్నిర్మించామని వివరించారు. ఆలయాభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ ఆర్థిక సహకారం గొప్ప విషయం అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, భీక్య రామకృష్ణ, అశోక్, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, మల్లేశ్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, రమేష్, కృష్ణయ్య, కె.అంజయ్య పాల్గొన్నారు.

'భూ సేకరణకు ఒప్పుకోం'

చేవెళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏ ప్రాజెక్టును నెలకొల్పుతారో ప్రకటించకుండా, ప్రజాభిప్రాయం చేయకుండా భూసేకరణ చేపట్టడం చట్టరీత్యా నేరమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. మండలంలోని హస్తేపూర్‌లో 400ఎకరాల సాగుభూమిని సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు అసైన్డ్ భూములను పట్టా భూములుగా మార్చాలని డిమాండ్ చేశారు. హస్తేపూర్‌లో పేదల అసైన్డ్ భూములపై ప్రభుత్వ కన్ను పడిందని, అందుకే లాక్కునే కుట్ర చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఇలా నిర్బంధ భూసేకరణ చేస్తే మరో లగచర్ల తరహా ఉద్యమం తప్పదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. దేనికోసం భూములు సేకరిస్తారో ప్రజలకు వివరించాలన్నారు. లేదంటే సేకరించిన భూములను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని స్పష్టం చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య చొరవ తీసుకుని భూసేకరణను విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువుకు చేరని చేప..

చేప పిల్లల పంపిణీపై నీలి నీడలు

మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలుపై ఈ సారి కూడా నీలి నీడలు కమ్ముకున్నాయి. గతేడాది టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం ఆలస్యంగా మొదలు పెట్టింది. కాంట్రాక్టర్లు కూడా అంతగా ఆసక్తి చూపలేదు. అదునుదాటాక చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. అవి ఎదగక మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయారు. చేప పిల్లలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బకాయిలు పేరుకు పోవడతో టెండర్లలో పాల్గొనేందుకు చాలా మంది విముఖత చూపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కాల్ చేసిన టెండర్లకు ఓ కాంట్రాక్టర్ దరఖాస్తు చేశాడు. అతడు సమర్పించిన ధ్రువపత్రాలు సరిగా లేక అధికారులు అతడి దరఖాస్తును రద్దు చేశారు. మరి ప్రభుత్వం రెండోసారి టెండరు ప్రక్రియను చేపడుతుందా.. లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదును దాటాక టెండర్ పూర్తి చేసి చేప పిల్లలను వదిలినా ప్రయోజనం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారీ చేప విత్తనాల పంపిణీకి మంగళం పాడుతారేమోనని మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.





చేప పిల్లల పంపిణీ, ఖర్చు వివరాలు

సంవత్సరం	పంపిణీ (లక్షల్లో)	ఖర్చు (రూ.లక్షల్లో)
2016	10.10	18
2017	99.74	63.10
2018	27.69	21.54
2019	70.54	33.06
2020	129.05	70.23
2021	163.13	117.19
2022	163.13	117.19
2023	162.35	114.60
2024	1.93	-

- పథకం అమలుపై ప్రభుత్వం అలసత్వం
- ఈ ఏడాది చేపల పంపిణీ అనుమానమే?
- గతంలో భారీగా బకాయిలు
- టెండర్లకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- సకాలంలో చేప పిల్లలను వదలక
- నష్టపోతున్న మత్స్యకారులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థిక లబ్ధిపొందేలా పూర్తి రాయితీపై అమలు చేస్తున్న చేప పిల్లల పంపిణీ పథకంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ఉంటుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ సంవత్సరం మేలోనే ఈ పథకం కోసం అధికారులు టెండర్లు పిలిచేవారు. అయితే 2025లో ఇప్పటివరకు టెండర్లు కాల్ చేయలేదు. ఈ పథకం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం వల్లే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలుస్తోంది. దీంతో

మిగతా 8వ పేజీలో...

టెండర్ల పేరిట కాలయాపన



చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం రూ.122కోట్లు కేటాయించింది. కానీ, టెండర్ల పేరుతో కాలయాపన చేస్తుంది. అదునుదాటాక చేపి పిల్లలు వదిలినా ప్రయోజనముండదు. చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేయకుండా మత్స్యకారుల సొసైటీలకు నేరుగా డబ్బులిస్తే వారే సకాలంలో నాణ్యమైన చేప విత్తనాలను కొని చెరువుల్లో పెంచుకుంటారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట కింద ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్యశాఖ కూల్చేసింది. దానిని పునరుద్ధరించాలి. అన్ని మార్కెట్‌లలో చేపల విక్రయ మార్కెట్లను నిర్మించాలి. కోహెడలో నిర్మించే మార్కెట్‌లో చేపల మార్కెట్‌కు అదనంగా మూడెకరాలు కేటాయించాలి.

గొరెంకల నర్సింహ, తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు



శివాలయంలో సినీ హీరో వెంకటతేజ

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

● సినీ నటుడు వెంకటతేజ

శంకర్‌పల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కిష్కిందపురి సినిమా హీరో వెంకటతేజ అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. లింగానికి అభిషేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పురాతన మరకత శివలింగాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మరోసారి కుటుంబ సభ్యులతో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటానని ఈ సందర్భంగా తెలిపారు.



కేశంపేటలో వర్షం

కేశంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేశంపేట, అల్వాల, కొత్తపేట, పాటిగడ్డ, వేములనర్వ, చౌలపల్లి, సుందరాపురం, కాకునూర్ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గంట పాటు వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో నీరు నిలిచింది.



పట్టుబడిన బెల్లం, పట్టిక, నిందితులతో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

22.5క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

» 50కిలోల పట్టిక స్వాధీనం

» ఎక్సైజ్ దాడుల్లో రికవరీ

» ముగ్గురు నిందితుల అరెస్ట్

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో నాటు సారా, నల్లబెల్లం, మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు దృష్టిసారించి దాడులను ముమ్మరం చేశారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్‌లో మంగళవారం ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బెల్లం, పట్టిక పట్టుబడింది. దసరా పండుగ రోజుల్లో మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఆమనగల్లు పరిధి గ్రామాలకు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సారా తయారీకి నల్లబెల్లం, పట్టిక తరలిస్తున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ నిఘా పెట్టింది. కడ్తాల టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో ఓ ఆటోలో 65 బ్యాగుల్లో 19.5 క్వింటాళ్ల నల్లబెల్లం, 40కిలోల పట్టిక పట్టుబడిందని సీఐ తెలిపారు. మరో ఆటోలో 3క్వింటాళ్ల బెల్లం, 10కిలోల పట్టిక లభించిందన్నారు. రెండు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు పి.మహర్షి, కె.కాశీం, యు.ఎల్లస్వామిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సీఐ బద్యానాథ్‌చౌహాన్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, లోక్య, బాబు, ఉపేందర్, ఆమని తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం

● నేడు షాబాద్, నాగర్‌గూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో పంపిణీ 6

● జిల్లా వ్యవసాయ అధికారి ఉష

మల్కారం సొసైటీలో రూ.17కోట్ల టర్నోవర్

● రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాల మంజూరు 8

● ప్యాక్స్ చైర్‌పర్సన్ ప్రభుసాగర్

చైర్మన్ దిగాల్సిందే..

» కాంగ్రెస్ డైరెక్టర్‌ను అధ్యక్షుడిగా నియామకంపై అభ్యంతరం

» హైకోర్టును ఆశ్రయించిన కందుకూరు సొసైటీ డైరెక్టర్లు

» మెజారిటీ లేదని కోర్టుకు వినతి



కందుకూరు వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయం

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సహకార సంఘం చైర్మన్ పదవి కేటాయింపుపై కోర్టు స్టే ఇస్తుందా? లేదా? అనే అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీ చైర్మన్ల పదవీకాలం గతంలోనే ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాత పాలకవర్గాలనే ఆరు నెలల చొప్పున రెండు సార్లు పొడిగించింది. రెంటో టర్మ్ పొడిగింపు కొనసాగుతుండగానే ప్రభుత్వం ఇటీవల పాత చైర్‌పర్సన్లు, వైస్‌చైర్‌పర్సన్లను మార్చేందుకు జీవో 639/2025 జారీచేసింది. ఈ నేపథ్యంలో కందుకూరు అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ(ప్యాక్స్) చైర్మన్‌గా కాంగ్రెస్ డైరెక్టర్‌ను నియమించారు. దీంతో ప్రభుత్వ నిర్ణయంపై పాత చైర్మన్లు, ప్రతిపక్ష పార్టీల డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు.

బీఆర్ఎస్ సభ్యులే అధికం..

కందుకూరు సొసైటీలో 13మంది డైరెక్టర్లు ఉన్నారు. సొసైటీకి 2020 ఫిబ్రవరి 14న జరిగిన ఎన్నికల్లో 8మంది బీఆర్ఎస్ అనుకూలురు డైరెక్టర్లుగా గెల్చారు. ముగ్గురు బీజేపీ, ఇద్దరు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వారు గెలుపొందారు. బీఆర్ఎస్‌కు చెందిన దేవరశెట్టి చంద్రశేఖర్ చైర్మన్‌గా, జి.విజయేందర్‌రెడ్డి వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వీరు పరోక్ష విధానంలో డైరెక్టర్ల మద్దతులో పదవులు చేపట్టారు. అయితే ప్రభుత్వం తాజా జీవోతో పాత డైరెక్టర్లలో ఒకరికి చైర్మన్ పదవి కేటాయించింది. ఇది బాగానే ఉన్నా.. బీఆర్ఎస్ డైరెక్టర్లు ఎక్కువ మంది ఉంటే.. ఇద్దరే డైరెక్టర్లు ఉన్న కాంగ్రెస్ నుంచి సత్తినేని వెంకట్‌రాంరెడ్డికి చైర్మన్ చేశారు. ఇది అప్రజాస్వామికం అని బీఆర్ఎస్, బీజేపీల 11మంది డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించి పదవి కేటాయింపుపై స్టే ఇవ్వాలని కోరారు. మెజారిటీ ఉన్న పార్టీ నుంచే చైర్మన్‌ను చేయాలని అభ్యర్థించారు. ఈ నైపథ్యంలో కోర్టు ఏ తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. న్యాయస్థాన నిర్ణయం కోసం పాతపాలకవర్గం ఎదురుచూస్తోంది.

నాణ్యమైన పాలసేకరణే లక్ష్యం

- పాడి రైతులకు విజయ డెయిరీ ప్రోత్సాహకం
- డెయిరీ డీడీ మోహన్‌మురళి



కందివనంలో పాలను పరిశీలిస్తున్న మోహన్ మురళి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం విజయ డెయిరీ ప్రోత్సాహకాలను ఇస్తోందని, నాణ్యమైన పాలసేకరణే లక్ష్యం అని డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌మురళి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనంలో మంగళవారం పాలసేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాల నాణ్యతను పరిశీలించి, సేకర్త టి.వెంకట్‌రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలసేకరణ, నాణ్యతను పెంచేందుకు వారంలో రెండు రోజులు సేకరణ కేంద్రాలను తనిఖీ చేస్తూ, రైతుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.ప్రభుత్వరంగ విజయ డెయిరీ రైతుల శ్రేయస్సు, ప్రజావసరాలకు అనుగుణంగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం షాద్‌నగర్ కేంద్రానికి 11వేలు, జిల్లా వ్యాప్తంగా 90 వేల లీటర్ల పాలు డెయిరీకి వస్తున్నాయని తెలిపారు. నాణ్యమైన పాలు పోసి, మంచి ధర పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పశువుల దాణా, మినరల్ మిక్చర్, గడ్డి విత్తనాలను సబ్సిడీపై ఇస్తున్నామని తెలిపారు. డెయిరీ ఫామ్‌ల ఏర్పాటుకు బ్యాంకు రుణాలను ఇప్పిస్తున్నామన్నారు. పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించామన్నారు. ఇకపై ప్రతీ 15 రోజులకు ఒకసారి బిల్లులిచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు.



తప్పని యూరియా వెతలు

కేశంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత వెతలు తప్పడం లేదు. కొత్తపేట ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం 450 బస్తాల యూరియా తెప్పించారు. పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా కేశంపేట సీఐ నరహరి పర్యవేక్షణలో ఎస్ఐ రాజ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు వచ్చారు. రెండు రోజుల కింద టోకెన్లు తీసుకున్న వారిలో ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున ఇచ్చారు. కొందరికి కొత్తగా టోకెన్లు ఇచ్చారు. కాగా 300కుపైగా రైతులు రావడంతో అందరికీ యూరియా దొరకలేదు. అధికారులు తెప్పిస్తున్న యూరియా సరిపోవడంలేదని రైతులు వాపోతున్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అందరికీ మెరుగైన వైద్యం

కందుకూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం అందేలా పీహెచ్‌సీల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ గీత అన్నారు. స్వస్త్‌నారి-స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం రాచులూరు ప్రాథమికఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహింగా గీత మాట్లాడారు. శిబిరంలో 162 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. వైద్యాధికారి సంధ్యారాణి, సౌజన్య, సీహెచ్‌వో మున్వర్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, యాదమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా బీఆర్ఎస్

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చినట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల జీవితాలను ఆగం చేస్తోందని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను జైపాల్‌యాదవ్ కలిశారు. బాధిత రైతులకు భరోసా ఇచ్చి అలైన్‌మెంట్ మార్పునకు చేపట్టే కార్యాచరణకు ఈనెల 25న మధ్యాహ్నం ఒంటిగంటకు తెలంగాణ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు అభిప్రాయాలను తెలుపాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, భాస్కర్‌రావు, తదితరులు ఉన్నారు.



కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న జైపాల్ యాదవ్, అర్జున్‌రావు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/నందిగామ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఫెమీనా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌లు హాజరైనారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫెమీనా మహిళా సేవా మండలి 400 మందికి ఉపాధి శిక్షణ ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునివ్వడం హర్షణీయమన్నారు. త్వరలోనే షాద్‌నగర్ పట్టణంలో మహిళల కోసం వృత్తి నైపుణ్యత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించేదుకు కృషి చేస్తానని తెలిపారు. కొత్వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మహిళ కోసం 400 కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బాబర్ అలీఖాన్, పి.రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ ఇబ్రహీం, షాద్‌నగర్ పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా, ఫెమినా అధ్యక్షురాలు ఆలియా పాల్గొన్నారు. అలాగే నందిగామ మండల పరిధిలోని పృథ్వీ కాలనీలో హెచ్‌ఎమ్‌డీఏ నిధులు రూ.80 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణం, నర్సప్పగూడలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు, నర్సప్పగూడ-చేగూర్ రోడ్డులో వంతెనపై రూ.72 లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపనలు చేశారు. నర్సప్పగూడలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్‌కు అవకాశాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, పసుల బుచ్చయ్య, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, సత్తయ్య, నర్సింలు, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవిందర్, శేఖర్, శ్రీశైలం, శివ, సాములయ్య, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

దసరాను శాంతియుతంగా జరుపుకోవాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు ప్రజలంతా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని, రోడ్లపక్కన పిచ్చి చెట్లు, చెత్తను తొలగించాలని, వార్డుల్లో లైట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ శంకర్ నాయక్‌ను ఆదేశించారు. పాత శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్, తహసీల్దార్ ఫయూద్దీన్, కమిషనర్ శంకర్‌నాయక్‌లతో కలిసి పరిశీలించారు. కళాశాల భూ వివాదాన్ని పరిష్కరించి తమకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన లండం చిన్న జంగయ్య ఎమ్మెల్యేను కోరారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, జగన్, మానయ్య, అప్పం శ్రీను, బాబా, కృష్ణనాయక్, ఖాదర్, వస్పుల శ్రీకాంత్, అవ్వారి శివలింగం, తదితరులు ఉన్నారు.



కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

అలాగే, ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను పరామర్శించి వైద్య చికిత్సలకు ఆర్థికసాయం అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, నాయకులు తదితరులున్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని కడ్తాల మండల హైటెన్షన్ విద్యుత్ లైన్ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రంలో బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 16వ రోజుకు చేరాయి. కానుగుల సత్యనారాయణ, శ్రీరాములు, యాదయ్య, వెంకట్రాములు, వెంకటేశ్‌లు కూర్చున్నారు. కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, పాండుయాదవ్, కృష్ణ, అమృతం, మహేశ్ పాల్గొన్నారు.

దేవరయంజాల్ భూములు

ఆలయానికి చెందినవే..

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ మండలం దేవరయంజాల్ గ్రామంలోని 1,521 ఎకరాల భూములు స్థానిక శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందినవేనని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా తమ పేర్లపై మార్చుకుని రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేసుకున్నారని పేర్కొంది. గ్రామంలోని సర్వే 688 నుంచి 712 వరకు ఉన్న వివిధ సర్వే నెంబర్లలో ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేరుస్తూ సీసీఎల్‌ఏ 2014లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో దాదాపు 300 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దేవదాయ చట్టాల ప్రకారం ట్రిబ్యునల్‌కు వెళ్లకుండా పిటిషనర్లు నేరుగా హైకోర్టుకు రావడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ల వాదనల కోసం విచారణను వాయిదా వేసింది.

అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్



నిరసన ర్యాలీలో ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పథకం ప్రకారం అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆరోపించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని విజేశ్‌నాయక్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆమనగల్లులో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదలైన విజేశ్‌నాయక్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చుక్క నిరంజన్‌గౌడ్, దోనాదుల కుమార్, జ్యోతయ్య, మహేశ్, వెంకటేశ్, గణేశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం

మహేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, ప్రతీ ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని జిమ్స్ ఆసుపత్రి వైద్యురాలు ఉమారాణి అన్నారు. మంగళవారం అమీర్‌పేట గ్రామంలో జిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్యశిబిరాలు, అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేసిన అధికారులు

ఇబ్రహీంపట్నం/యాచారం 23(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవన్నప్ప సూచించారు. యాచారం మండలం చౌదర్‌పల్లిలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రైతు పొలం బడి కార్యక్రమంలో భాగంగా టమాట తోటలో రైతు క్షేత్ర పాఠశాల నిర్వహించారు. బసవన్నప్ప మాట్లాడుతూ పురుగు మందులను అవసరం మేరకే వాడాలని సలహాలు, సూచనలు చేశారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్ అనే మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణాధికారి రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం



కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉష, తదితరులు

షాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఉష తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం షాబాద్ సహకార బ్యాంకు గోదాంను పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ నేడు(బుధవారం) షాబాద్, నాగర్‌గూడ, సర్దార్‌నగర్ గ్రామాల్లో యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్ బాబు, కృష్ణమోహన్, ఏఈవోలు కిరణ్మయి, రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో పశువైద్యులు

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం

తాండూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న పశువైద్య ఏడీఏ కార్యాలయంలో ఇప్పటి నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సదానందం అన్నారు. ఆయన మంగళవారం ఏడీఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువైద్య ఏడీఏ కార్యాలయానికి యాలాల మండల పశువైద్యాధికారి శివదుర్గాను నియమిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇన్‌చార్జి ఏడీఏగా ఉన్న కొడంగల్ ఏడీఏ నోహను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించినట్లు తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ప్యారమేట్ అశోక్ (సోమ, మంగళ, బుధ వారం). కుక్కింద సబ్‌సెంటర్ ప్యారమేట్ సైదులు (గురు, శుక్ర, శనివారం) రైతులకు అందుబాటులో ఉంటారని అన్నారు. యాలాల మండల పశువైద్యాధికారి ప్రతీరోజు మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలో 33 మండల పశు వైద్యులకు 15పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 60 ప్యారమేట్ సిబ్బందికి 25 ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. పశుగ్రాసం విత్తనాలు 10క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, 75శాతం సబ్సిడీపై పాడి రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ సదానందం

‘శాకాహార ర్యాలీ’ని విజయవంతం చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న చేవెళ్లలో నిర్వహించే మహకరుణ అహింసా-శాకాహార ర్యాలీని విజయవంతం చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నడిమోళ్ల శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28న కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సామూహిక ధ్యాన కార్యక్రమం భారీఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సీహెచ్ ప్రభాకర్, తాజొద్దీన్ తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్ తదితరులు



పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రారంభమైన పనులు

బషీరాబాద్‌లో రోడ్డు పనులు షురూ

బషీరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ‘అధ్వానంగా రోడ్లు’ అనే శీర్షికన ఈనెల 20వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. బషీరాబాద్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఎక్స్‌కవేటర్‌తో రోడ్డంతా తవ్వి కొద్ది రోజులుగా వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి రోడ్డు పనుల జాప్యంపై ఆరాతీసి వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఎట్టకేలకు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి వదిలేసిన గుంతలో మట్టి నింపే పనులను మంగళవారం ప్రారంభించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభకావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పట్టుబడిన బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

తండాల్లో ఎక్సైజ్ దాడులు

» ఐదుగురిపై కేసు నమోదు

బషీరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 350 లీటర్ల బెల్లం పానకం, తొమ్మిది లీటర్ల సారాయిని పట్టుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో వికారాబాద్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ విజయభాస్కర్ నేతృత్వంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఎక్సైజ్ అధికారులు కొత్లాపూర్‌తండా, నంద్యానాయక్ తండా, వాల్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండాల్లో దాడులు జరిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం సారాయిని సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు ఎక్సైజ్ సీఐ ఆదిశేషరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో కొండంగల్, మోమిన్‌పేట్, వికారాబాద్, డీటీఎఫ్ బృందాలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

మహిళలందరికీ చీరలు పంపిణీ చేయాలి

పరిగి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా బతుకమ్మ చీరలను మహిళలందరికీ ఇవ్వాలని సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కేవలం మహిళా సంఘాల్లోని సభ్యులకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం సబబు కాదన్నారు. తెలంగాణలోని మహిళలందరినీ గౌరవించాలని డిమాండ్ చేశారు. కొందరికి ఇచ్చి, మరికొందరికి ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ఇది ఒకరకంగా మహిళలను అవమానించడమేనని విమర్శించారు. కొంతమందికే ఇస్తే లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుందనే విషయాన్ని పాలకులు గుర్తించాలని సూచించారు. రాష్ట్రంలోని మహిళలందరికీ బతుకమ్మ చీరలను ఇవ్వాలని కోరారు.



పీర్‌మహ్మద్

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

» రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.8లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎంతో మంది నిరుపేదలకు కోట్లాది రుపాయలు వెచ్చించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, భవిష్యత్‌లో రాష్ట్రాన్ని ఎంతో ఉన్నత స్థితికి తీసుకెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీరటి రాజు ముదిరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, దండు ఇస్తారి, జిట్టె సిద్ధులు, సతీష్‌యాదవ్, అనేగోని శ్రీకాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఊరేగింపులో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి బ్రహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు మంగళవారం ఆలయంలో వేంకటేశ్వర స్వామికి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఊరేగింపు అనంతరం పల్లకీసేవాలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు డాక్టరేట్

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండికి చెందిన కేహెచ్ మురళీ నాయక్ డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఆయన షాబాద్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. విద్య నైపుణ్యం పట్ల నిబద్దత, అనేక విషయాలపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.



రిజర్వేషన్లు ఖరారు!

» సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా యంత్రాంగం

» బీసీ రిజర్వేషన్ల జీవో విడుదల తర్వాత ప్రకటించే అవకాశం



వికారాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల్లో 42 శాతం మేరకు బీసీలకు రిజర్వు చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించనుండగా, తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలను జిల్లా కలెక్టర్ ఖరారు చేయగా, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులను ఆర్డీవో ఖరారు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీవో ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. యను న్నారు. గత ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన స్థానాలను ఈసారి మినహాయించి, మిగిలిన స్థానాలను ఆయా వర్గాలకు రిజర్వు చేసినట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాలు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ నేతృత్వంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రాత్రింబవళ్లు శ్రమించాల్సివచ్చింది. ఎట్టకేలకు మంగళవారం రాత్రి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి సీల్డ్ కవర్‌లో నివేదిక పంపించారు.

బీసీలకు 42 శాతం...

వికారాబాద్ జిలాల్లో 20 మండలాల్లో 594 గ్రామ పంచాయతీలు, 5058 వార్డులు, 20 జడ్పీటీసీలు, 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖాయమైతే... జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు 8 లేదా 9 జడ్పీటీసీ పదవులు బీసీలకు ఖరారు చేసే అవకాశం ఉంది. మండల పరిషత్తు అధ్యక్ష పదవులు కూడా ఇదే సంఖ్యలో ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. 227 ఎంపీటీసీ స్థానాల్లో 95 లేదా 96 స్థానాలు బీసీలకు కేటాయించనున్న సమాచారం. జిల్లాలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 249 లేదా 250 సర్పంచ్ పదవులు బీసీలకు రిజర్వు అయ్యే అవకాశం ఉంది. 5058 వార్డు సభ్యుల స్థానాల్లో 2124 లేదా 2125 వార్డు సభ్యుల పదవులు బీసీలకు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకువచ్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం వెలువడనున్నట్లు తెలుస్తోంది.

రుణమాఫీని వర్తింపజేయాలి

» మంత్రి శ్రీధర్‌బాబును కోరిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, కేఎల్లార్, తదితరులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు రుణమాఫీని వర్తింపజేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి సమస్యను వివరించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘట్‌కేసర్ సహకార సంఘం ప్రతినిధులు నగరంలోని వారి కార్యాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ చేసి ఘట్‌కేసర్ మండల రైతులకు మాఫీ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఘట్‌కేసర్ సహకార సంఘంలో 1182మంది రైతులకు దాదాపు రూ.8కోట్ల90లక్షలు మాఫీ కావాల్సి ఉందన్నారు. రుణమాఫీ కోసం గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఈవిషయమై స్పందించిన మంత్రి ఆర్థికశాఖ, సీఎం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, ఘట్‌కేసర్ సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

నల్సార్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి

» ఆలస్యంగా వెలుగులోకి..

శామీర్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సహస్రాన్షు(22) శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌కు చెందిన సహస్రాన్షు నల్సార్‌లో బీఏ ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇతని తమ్ముడు కూడా నల్సార్‌లోలా కోర్సులో మూడో సంవత్సరం చదుతున్నాడు. కాగా, ఈ విద్యార్థి క్యాంపస్‌లో శనివారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ అల్వాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి వైద్య చికిత్స పొందగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి సుచిత్రలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సహస్రాన్షును వైద్యులు అర్ధరాత్రి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం నల్సార్ అధికారులు రాయ్‌పూర్‌లో ఉన్న సహస్రాన్షు తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి సహస్రాన్షు మృతదేహాన్ని రాయ్‌పూర్‌లోని నివాసానికి తరలించారు. కాగా సహస్రాన్షు మృతికి గల కారణాలు తెలియరాలేదు. సహస్రాన్షు మృతిపై నల్సార్‌లోని పలువురు విద్యార్థుల వద్ద ఆరా తీయగా పలు రకాలుగా అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యార్థి మృతి చెందడంతో అధికారులు మంగళవారం నుంచి నల్సార్ అకాడమికి సెలవులు ప్రకటించారు. కాగా, నల్సార్ విద్యార్థి అనుమానాస్పద మృతి పట్ల ఆంధ్రజ్యోతి ప్రతినిధి శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థికాభివృద్ధి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశప్రజల ఆర్థికాభివృద్ధికే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తెచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. పార్టీ షాద్‌నగర్ కన్వీనర్ టి.విజయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏబీ కాంప్లెక్స్‌లో జీఎస్టీ సంస్కరణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ రాకతో కేంద్ర ఆదాయం రూ.ఏడు వేల కోట్ల నుంచి 22వేల కోట్లకు పెరిగిందన్నారు. ఈ నిధులతో విమానాశ్రయాలు, రైల్వేలు, హైవేలు, కేంద్ర విద్యాసంస్థల అభివృద్ధి చేపడుతున్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజల ఆర్థికాభివృద్ధికి హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లు, విద్యారంగంపై జీఎస్టీని ఎత్తివేశారని గుర్తుచేశారు. అయితే జీఎస్టీ మార్పులతో రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత ఏర్పడిందన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం కన్వీనర్ గోపాల్‌నారాయణ్ మాట్లాడుతూ.. షాపింగ్ మాల్స్‌లో పన్ను తగ్గించకుండా విక్రయిస్తే ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు శ్రీపాల్‌గుప్తా, హరిభూషన్, వెంకటేశ్‌గుప్తా, అశోక్‌గౌడ్, భూపాల్‌చారి, మనోహర్‌రెడ్డి, నర్సింహాగౌడ్, మోహన్‌నాయక్, చెట్ల వెంకటేశ్, ప్రశాంత్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీటిసరఫరా సక్రమంగా జరపటంలేదని మేడ్చల్ మేన్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆరోపించారు. తన పార్టీ కార్యకర్తలతో కలిసి మంగళవారం ఆమె మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి తాగునీటి కష్టాలు పెరుగాయని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలుప్రాంతాల్లో హరితహారం కింద నాటిన చెట్లను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నరుకుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎం.నరేష్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని కేఎల్‌ఆర్ వెంచర్‌లో లక్షల రూపాయలు వెచ్చించి పెంచిన హరితహారం మొక్కలను కొందరు ప్లాట్ల యజమానులు నిర్దాక్షిణ్యంగా నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ గ్రామం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ పద్మావతికి ఫిర్యాదు చేశారు. సదరు కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూర్ చంద్రయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాండూరులో మెగా వైద్య శిబిరం

» ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన మెగా వైద్య బిరాన్ని మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అక్టోబరు 2 వరకు కొనసాగే ఈ శిబిరంలో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్యసేవలు అందించనున్నారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడ ఉన్న వైద్యులతో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, అంజయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాండూరు నియోజకవర్గానికి చెందిన 157 మంది లబ్ధిదారులకు రూ.60లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, అజయ్‌ప్రసాద్ ఉన్నారు.

తాండూరు కవికి కీర్తి పురస్కారం



చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారాన్ని అందజేస్తున్న డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం 2024 కీర్తి పురస్కారాలను ఎన్టీఆర్ కళా మందిరంలో అందజేసింది. ఇందులో భాగంగా తాండూరుకు చెందిన కవి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారాన్ని పద్మభూషణ్, శాంత బయోటెక్నిక్ వ్యవస్థాపకులు డాక్టర్ కేవీ వరప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయల కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డి, సురవరం ప్రతాప్‌రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుధండ నిత్యానందరావు పాల్గొన్నారు. చంద్రశేఖర్‌కు కీర్తి పురస్కారం రావడంపై తాండూరుకు చెందిన పలువురు అభినందించారు.

డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా పట్టించుకోరా?



అనంతగిరిపల్లిలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు

వికారాబాద్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ పొంగుతున్న, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్న మునిసిపల్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని అనంతగిరిపల్లిలో ఇండ్ల ముందు నుంచి డ్రైనేజీ పొంగిపొర్లుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. వార్డు అధికారికి పలుమార్లు చెప్పిన స్పందించడం లేదని, కనీసం గడ్డిమందు సైతం పిచికారి చేయడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రితో నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, కల్వకుర్తి-హైదరాబాద్ రూట్‌లో బస్సు ల సంఖ్య పెంచాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన దశరథం

తలకొండపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): వెంకట్రావ్‌పేటకు చెందిన పీసీసీ కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి కానుగుల దశరథం మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గాంధీభవన్‌లో కలిసి సేవాదల్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించినట్లు దశరథం పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నట్లు తెలిపారు.

ఘనంగా తుల్జాభవానీ మాత విగ్రహ ప్రతిష్ఠ

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మైసిగండి గ్రామంలో నూతనంగా నిర్మించిన తుల్జాభవానీ మాత ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉపాసకులు రాజుశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తొలిరోజు విస్లావత్ వంశీయులు హోమం, పూజలు చేపట్టారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. నేడు(బుధవారం) నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

చెరువుకు చేరని చేప..

(ఐదో పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా 8,221 మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. 2016-17లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

ప్రతి ఏటా ఆలస్యంగా...

చేప పిల్లల పంపిణీ తూతూమంత్రంగా మారింది. ఏటా చేప పిల్లలను చెరువుల్లో ఆలస్యంగా వదులుతున్నారు. జూలైలో చేప విత్తనం పంపిణీ చేయాల్సి ఉండగా, మూడు నెలలు ఆలస్యం చేస్తున్నారు. దీంతో చెరువుల్లో నీటిమట్టం తగ్గి, చేపలు ఎదగడం లేదు. నిండుగా నీరు ఉన్న చెరువుల్లో 45 రోజుల (35-40 మి.మీ పొడవు) వయసున్నవి, ఏడాది మొత్తం నీరు ఉండే పెద్ద చెరువుల్లో 75రోజుల(80-100 మి.మీ పొడవు) వయసున్న చేప పిల్లలను వదులుతారు. అవి కిలో సైజు పెరగాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. జూన్, జూలైలో వదిలితే డిసెంబర్ నుంచి రెండు, మూడు నెలల పాటు వాటిని విక్రయించుకుంటారు. ఆలస్యంగా వదిలితే నీటి లభ్యత తక్కువై చేపలు ఎదుగువు. ఇకపోతే చేపలను సెప్టెంబరులో వదిలితే కిలో సైజు పెరగాలంటే ఫిబ్రవరి వరకు ఆగాల్సి ఉంటుంది. మరింత పెరగాలంటే వేసవి వస్తుంది. అయితే, ఎండ వేడిమి ప్రభావంతో చేపలు చనిపోతాయని మత్స్యకారులు వాపోతున్నారు.

ఉచితంలో చేర్చని కొర్రమట్ట..

కొర్రమట్ట(కొర్రమీను)కు రాష్ట్రంలో డిమాండ్ ఎక్కువ. రుచికరమైన ఈ చేపను తినేందుకు ప్రజలు ఎక్కువ ఇష్టపడతారు. దీనిని రాష్ట్ర చేపగానూ ప్రభుత్వం ప్రకటించింది. అలాంటి చేపను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయకపోవడం సరికాదని అంటున్నారు. రాష్ట్ర చేప వృద్ధిలో ప్రభుత్వమే నిర్లక్ష్యం చేయడం తగదని మత్స్యకారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే మత్స్య శాఖ కేవలం రెండు రకాల(బొచ్చ, రవ్వ) చేప పిల్లలనే చెరువుల్లో వదులుతోంది.

సగానికి పైగా మాయం..

మత్స్య శాఖ అందించే చేపలను ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి టెండర్ల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. చెరువుల్లో చేప పిల్లలను వదలకుండానే లెక్కల్లో మాత్రం పంపిణీ చేసినట్లు చూపుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేప పిల్లల నిధులు స్వాహా అవుతున్నాయని ఆరోపణలున్నాయి. గతేడాది జిల్లా మత్స్య శాఖ జిల్లా అధికారి సుకీర్తి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఆమెను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

చెరువును బట్టి విత్తన చేపలు...

చెరువు రకం, చేప విత్తనాలను బట్టి చెరువుల్లో వదిలే విత్తన చేపల పరిమాణంలో తేడాలు ఉంటాయి. చెరువు విస్తీర్ణంలో 50శాతం విస్తీర్ణాన్నే లెక్కలోకి తీసుకుంటారు. ఎకరం విస్తీర్ణం కన్నా తక్కువ ఉండే చెరువుల్లో 3వేల చేప పిల్లలు వదులుతారు. నీరు నిల్వ ఉండే చెరువుల్లో 80-100 మిల్లీ మీటర్ల సైజు చేప పిల్లలను వదులుతారు. జిల్లాలో 120 చిన్న చెరువులు, 978 పెద్ద చెరువులు మత్స్యశాఖ ఆధీనంలో 7,297 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. 2016-17లో వదిలిన చేప పిల్లల సంఖ్య 25లక్షలు ఉండగా 2023-24నాటికి 799 చెరువుల్లో 162.35లక్షల చేప పిల్లలను వదిలారు.

186 మత్స్యకారుల సంఘాలు

జిల్లాలో 186 ప్రాథమిక మత్స్యకారుల సహకార సంఘాలు ఉండగా వీటిలో 162 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉన్నాయి. మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు 18 ఉన్నాయి. అలాగే మత్స్యపారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘాలు ఆరు ఉన్నాయి. వీటిలో 9,136 మంది సభ్యులు ఉన్నారు.

కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు



ఈ ఏడాది చేప విత్తనాల పంపిణీకి టెండర్ ప్రక్రియను చేపట్టాం. ఒక కాంట్రాక్టర్‌కు ముందుకు వచ్చినా అతడు సరైన పత్రాలు సమర్పించలేదు. దీంతో టెండర్‌ను రద్దు చేశాం. టెండర్ ప్రక్రియను చేపట్టి చేపపిల్లలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ కాంట్రాక్టర్లే మందుకు రావడం లేదు.

- పూర్ణిమ, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఘనంగా మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు





చేవెళ్ల : మహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



శంషాబాద్ రూరల్ : మహేందర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

చేవెళ్ల/శంషాబాద్ రూరల్/శంషాబాద్‌, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్సీ నివాసంలో మహేందర్‌రెడ్డిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున తరలివెళ్లి ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అరుణ రామేశ్వర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, మాజీ డైరెక్టర్ ఎం.యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి (చింటు), మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, భీమయ్య, రాంరెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, అభిమానులు తదితరులు ఉన్నారు. అలాగే మహేందర్‌రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు శాలువాలు కప్పి, కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభకాంక్షలు తెలిపారు. మున్ముందు మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీరటి రాజు ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, దండు ఇస్తారి, శ్రీకాంత్‌గౌడ్, మహేందర్ ముదిరాజ్ తదితరులున్నారు. అలాగే మహేందర్‌రెడ్డికి కొత్వాల్‌గూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు పగుడాల శ్రీనివాస్‌గౌడ్, పి.సిద్దేశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు(23) మంగళవారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. అనారోగ్యం, మానసిక వేదనతో కొంతకాలంగా బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు. తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఓ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. మృతుడి తండ్రి లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బతుకమ్మ ఆడుతూ.. మహిళ మృతి

ఆదిభట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఆడుతూ మహిళ మృతిచెందిన ఘటన ఆదిభట్ల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన పొరెళ్లి లక్ష్మి(66) ఆదిభట్ల మునిసిపాలిటీలో రామకృష్ణకి చెందిన టాటా కన్సల్టెన్సీ హాస్టళ్లలో వార్డెన్‌గా పనిచేస్తోంది. ఈ నెల 21న రాత్రి బతుకమ్మ ఆడుతుండగా లక్ష్మికి గుండెపోటు వచ్చి అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలు లక్ష్మి గతంలో సూర్యాపేట జిల్లా ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలిగా పనిచేసినట్లు తెలిపారు. భర్త నాగయ్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డబ్బు విషయంలో వ్యక్తి కిడ్నాప్

- నిందితులపై కేసు నమోదు

కొత్తూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడంతో సదరు వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం ప్రకారం... తిమ్మాపూర్‌నకు చెందిన కోటేశ్వర్ బ్యాటరీల వ్యాపారం చేస్తుంటాడు. హైదరాబాద్‌కు చెందిన జస్వంత్ నుంచి కోటేశ్వర్ రూ. 16లక్షలను శంషాబాద్ మండలం పాల్మాకులకు చెందిన ప్రశాంత్ ద్వారా అప్పుగా తీసుకున్నాడు. అయితే, కోటేశ్వర్ అప్పు చెల్లించకపోవడతో జస్వంత్ పలుమార్లు కోటేశ్వర్ వద్దకు వచ్చి వెళ్లాడు. ఈక్రమంలో జస్వంత్ తన అనుచరులతో కలిసి సోమవారం సాయంత్రం తిమ్మాపూర్‌నకు వచ్చాడు. అక్కడ కోటేశ్వర్‌ను కలుసుకొని కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఇది గమనించిన కోటేశ్వర్ భార్య రాణి స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫోన్ ద్వారా నిందితుల సమాచారం తెలుసుకున్న పోలీసులు హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు వెళ్లి కోటేశ్వర్‌తో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రాత్రి పోలీస్‌స్టేషన్ తీసుకవచ్చారు. కోటేశ్వర్‌ను భార్య రాణికి అప్పగించారు. కిడ్నాప్ విషయంపై విచారణ చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇదిలాఉండగా.. ఈ విషయమై దొంగ నోట్ల మార్పిడి విషయంలో విభేదాలు తలెత్తాయంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ నర్సింహారావులను వివరణ కోరగా.. దొంగనోట్ల మార్పిడిపై సమాచారం లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



కొత్తూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో పెంజర్ల చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దాదాపు 70 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మంగళవారం ఉదయం రోడ్డు పక్కన తీవ్ర గాయాలకు గురైన గుర్తుతెలియని వ్యక్తిని గుర్తించారని, పరిశీలించగా మృతిచెంది ఉన్నాడని తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పెట్రోలింగ్ కానిస్టేబుల్ శిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సెల్‌నెంబర్ 8712568383ను సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

మూడు తులాల బంగారం చోరీ

ఆదిభట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మూడు తులాల బంగారం చోరీ జరిగిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సైదయ్య కథనం మేరకు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ మున్సిపల్ సూర్యనగర్ కాలనీలో ఉండే హరీశ్‌కు ఆదిభట్ల టీసీఎస్ ఎదురుగా ఉంటున్న మానసకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో డబ్బులు కావాలని ఈనెల 21న మానస ఇంటికి తన స్నేహితులు తరుణ్, ప్రకాశ్‌తో కలిసి వెళ్లాడు. మానస ప్రకాశ్‌తో మాట్లాడుతుండగా.. హరీశ్ నీళ్ల తాగుతానని ఇంట్లోకి వెళ్లి మూడు తులాల గోల్డ్ చైన్‌ను దొంగిలించాడు. ఈ విషయమై మానస తల్లిదండ్రులు హరీశ్‌పై ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టిన పోలీసులు మన్నెగూడలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు నిర్ధారించారు. ఈమేరకు బంగారు గొలుసు దొంగిలించిన హరీశ్‌తో పాటు అతడి స్నేహితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదయ్య తెలిపారు.

దివ్యాంగుల పింఛన్ పెంచి ఇవ్వాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

చేవెళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు పింఛన్ రూ.6 వేలకు పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సభ్యుడు యాదయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ఏవో రాజశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు బోడ శ్రీనివాస్, కుమార్, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

శంకర్‌పల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని సంగారెడ్డి రోడ్డులో ఏర్పడ్డ గుంతలను మంగళవారం ఎస్‌బీ సూపర్ మార్కెట్ యాజమాన్యం పూడ్చి వేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి ఇబ్బందిగా మారింది. ప్రయాణీకులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా... అధికారులు పట్టించుకోలేదు. దీంతో శంకర్‌పల్లి ఎస్‌బీ సూపర్ మార్కెట్ యాజమాన్యం స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను కంకర, సిమెంటు కలిపి పూడ్చి వేయించారు. అదే విధంగా సాయిబాబా కమాన్ వద్ద ఏర్పడ్డ గుంతను సైతం పూడ్చివేచించారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను సూపర్ మార్కెట్ వారు సొంత డబ్బులు వెచ్చించి పూడ్చించడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

వైద్యశిబిరం విజయవంతం



కేశంపేట : పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేశంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వస్త్ స్వశక్తి-నారీ పరివార్ అభియాన్‌లో ఆరోగ్య సదస్సులు ప్రారంభించారు. ఈమేరకు మంగళవారం కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత ప్రారంభించారు. క్యాన్సర్, టీబీ, దంత, కంటి, మధుమేహ, మాతా శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. శిబిరానికి వచ్చిన మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కొంతమందిని మెరుగైన వైద్య పరీక్షలకు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. శిబిరంలో దాదాపు 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఉస్మానియా ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐశ్వర్య, వవస్థలిపురం ఏరియా ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మౌనిక, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో విద్యాసంస్థలు తెరవొద్దు

చేవెళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో విద్యాసంస్థలు నడవకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సభ్యుడు మాల చందు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సెలవులు ప్రకటించినా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా మౌనం పాటిస్తున్నారని, సెలవుల్లో విద్యాసంస్థలు నడిపితే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



నాగన్‌పల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న బూడిద రామ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్, ముకునూరు, దండుమైలారం, నెర్రెపల్లి, నాగన్‌పల్లి, పోల్కంపలి గ్రామాల్లో పంచాయతీ సిబ్బందికి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీలకు గ్రాస్ కట్టర్లు అందజేశారు. ప్రతీయేటా దసరా సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామ్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేస్తూ వస్తున్నారు.

ఎకరాకు 1500 గజాల స్థలం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మొయినాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములను ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో ఎకరాకు 1500 గజాల స్థలంలో ప్లాట్లు కేటాయించాలని మొయినాబాద్ మండల 4వ తరగతి ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ. మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో ఉన్న అసైన్డ్ భూమి సర్వేనెంబర్ 218లో 1966వ సంవత్సరంలో జీవో 1406 ప్రకారం అప్పటి ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులకు అసైన్డ్ భూమి కేటాయించిందని, ప్రభుత్వ అవసరాల కోసం తిరిగి తీసుకుంటున్నామని ఉద్యోగులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. అధికారులు ఎకరాకు 800 గజాలు, హెచ్ఎండీఏ లేఅవుట్ చేసి ఇస్తామని గ్రామ పెద్దల సమక్షంలో చెప్పారని, మూడు తరాల నుంచి ఆ భూములనే నమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఎకరాకు 1500 గజాల భూమితో పాటు ఎచ్ఎండీఏ లేఅవుట్ చేసి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.



పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాల అమలు

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేస్తుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మైసిగండి గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.5 లక్షలతో చేపట్టే అంతర్గత మురుగు కాల్వ నిర్మాణం పనులకు మంగళవారం స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రూ. 600 కోట్లతో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరాసింగ్, రవినాయక్, హర్యానాయక్, కిషన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దండుమైలారం పీహెచ్‌సీలో 'సేవా పక్వాడా'

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా దండుమైలారం పీహెచ్‌సీలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం తొలగించి రోగులకు పండ్లు పంపిణీ చేసి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, మండలాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, బాలశివుడు, తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తహసీల్దార్‌కు నాయకుల సన్మానం

కేశంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేశంపేట తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజేందర్‌రెడ్డిని మంగళవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా శాలువాలతో సత్కరించారు. భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులకు రేషన్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు నవీన్‌కుమార్, అంజిరెడ్డి, శ్రీశైలంగౌడ్, మల్లేష్ యాదవ్, కృష్ణయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, బీరప్ప, నరేష్ యాదవ్, రాజేందర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అమేర్, జంగయ్య, అజహర్, రమేష్, రాఘవేందర్ ఉన్నారు.





తహసీల్దార్ రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో రాజకీయ లబ్ధి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధికి కాంగ్రెస్ నాయకులు ఎత్తుగడలు సాగిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఆరోపించారు. ఆరు గ్యారంటీల, 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెంకటేశ్ పర్యటించారు. బిల్లులు రాక నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అధైర్యపడొద్దని, మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు చెల్లించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని, ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ విధానాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను వేదనకు గురిచేస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నిరంజన్‌గౌడ్, వెంకటయ్య, కుమార్, మహేశ్, గణేశ్, వెంకటేశ్, విక్రమ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం



అవినాశ్ మహంతి నుంచి సత్కారం పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ గోపాల్

కొత్తూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మూసాపేట గోపాల్‌కు సత్కారం లభించింది. 25 ఏళ్లపాటు సమర్థవంతంగా విధులు నిర్వర్తించి, ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకుగాను సైబారాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మంగళవారం ఆయన కార్యాలయంలో గోపాల్‌కు ఉత్తమ సేవా పతకాన్ని బహూకరించి, అభినందించారు. ఈ సందర్భంగా గోపాల్‌కు స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్సైలు గోపాలకృష్ణ, సత్యశీలారెడ్డి, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సన్మార్గంతో దైవానుగ్రహం



పూజల్లో గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతో దైవానుగ్రహం లభిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేఖ్యతండాలో మంగళవారం సేవాలాల్ స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, కృష్ణనాయక్, శ్రీనునాయక్, సేవ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, నరేశ్, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

మల్కారం సొసైటీలో రూ.17 కోట్ల టర్నోవర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుసాగర్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని మల్కారం ప్రాథమిక సహకార సంఘంలో లావాదేవీలు రూ.17 కోట్ల టర్నోవర్ జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు మేకల ప్రభుసాగర్ తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘంలోని వ్యవసాయదారులు పొందిన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలను తీసుకోవాలన్నారు. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తుండటంతో ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు సంఘం తరఫున సభ్యులకు పంట రుణాలు రూ.కోటి, దీర్ఘకాలిక రుణాలు రూ.3 కోట్లు హెచ్‌డీసీసీబీ నుంచి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.